

కళాశాలలు ఖాళీ..!



పీయూలో మిగిలిపోయిన **1,18,003** సీట్లు

- అందరి చూపు ప్రైవేట్ కళాశాలల వైపే..
- యథేచ్ఛగా అనుమతులు
- ఆధునిక కోర్సులపై దృష్టి పెట్టని బోర్డు అధికారులు

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్య చదివేందుకు అవకాశాలు మెరుగుపరచాలని భావించిన ప్రభుత్వం ఇతోధికంగా ప్రైవేటు కళాశాలలకు అనుమతులు ఇస్తూ వచ్చింది. ఏ స్థాయిలో అంటే రాష్ట్రంలో ఏటా సరాసరిన ఎంతమంది పదో తరగతి చదువుతారని అంచనాలు లేకుండా అడిగిందే తడవుగా పీయూ కళాశాలలకు అనుమతులు మంజూరు చేస్తూ వచ్చారు. ప్రభుత్వ కళాశాలలు అయితే మౌలిక సదుపాయాలు సమకూర్చడంతోపాటు అధ్యాపకులను నియమించాల్సి ఉంటుంది. అటువంటి సౌకర్యాలు ఏర్పాటు చేయలేక ప్రాంతాలవారీగా ప్రైవేట్ కళాశాలలకు అనుమతులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఇలా ఏకంగా ఈ సంవత్సరం పీయూలో 1.18 లక్షల సీట్లు ఖాళీగా ఉన్నాయి. కనీసం ఓ కళాశాలకు వెయ్యి నుంచి 2వేల సీట్లు అనుకున్నా 60-70 కళాశాలలు ఖాళీ అని చెప్పవచ్చు. ఈ ప్రభావం రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ప్రాంతాల పీయూ కళాశాలలపై చూపింది. నగర ప్రాంతాల్లోని కళాశాలల్లో కోర్సులతోపాటు ఇతరత్రా సదుపాయాలు ఉండడంతో అక్కడ చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లోని పీయూ కళాశాలల పరిస్థితి అధ్వానంగా మారింది.

ఐదేళ్లలో ప్రైవేట్ కళాశాలల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం 3,623 ప్రైవేటు కళాశాలలు ఉన్నాయి. సాధారణ పాఠ్యాంశాలతోపాటు నీట్, సీఈటీ, జేఈఈ కోర్సుల శిక్షణ ఇస్తున్నారు. దీంతో సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులలో చదవాలనుకున్న వారు ప్రైవేటు కళాశాలలవైపు వెళ్తున్నారు. ఇప్పటికే కొన్నేళ్లుగా ఉత్తమ ఫలితాలు నమోదు చేసిన, పేరున్న విద్యాసంసల్లో ఫీజులు ఎక్కువైనా అటువైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిణామం ప్రభుత్వ పీయూ, ఎయిడెడ్ కళాశాలలపై పెను ప్రభావం చూపుతోంది. కొన్ని కళాశాలలు మూసివేసే పరిస్థితికి చేరుకున్నాయి. రెండేళ్ల పీయూ కోర్సులో చేరికతో ఉచితంగా నీట్, సీఈటీ, జేఈఈ వంటి కోర్సులకు శిక్షణ ఇస్తామని బహిరంగంగా ప్రైవేటు కళాశాలలు ప్రకటిస్తున్నాయి. స్మార్ట్ క్లాసులు, డిజిటల్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పుకొంటున్నాయి. కర్ణాటక పబ్లిక్ స్కూల్ (కేపీఎస్)లో ప్రాథమిక నుంచి ద్వితీయ పీయూ వరకు చదువుకునే వెసలుబాటు ఉంది. ఇక్కడ గుణాత్మకమైన శిక్షణ ద్వారా పోటీ పరీక్షల్లో పాల్గొనేలా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారు. అందుకు తగ్గట్టుగానే అనుభవం ఉన్న అధ్యాపకులను నియమిస్తున్నారు. ప్రైవేటు కళాశాలల తరహాలోనే పబ్లిక్ స్కూల్‌లో చదివేందుకు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. పబ్లిక్ స్కూల్స్‌లో ఫర్నీచర్‌తోపాటు కొత్త ల్యాబ్‌లు అనువుగా తీరుస్తున్నారు. ఇలాంటి ఆకర్షణీయమైన ప్రభావాలన్నీ ప్రభుత్వ పీయూ కళాశాలలపై కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి.



పీయూ బోర్డు కార్యాలయం

రాష్ట్రంలో 1,319 కళాశాలలు

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పీయూ కళాశాలలు 1319 ఉన్నాయి. ఎయిడెడ్ 815, విభజిత 159, ప్రైవేటు 3623, కార్పొరేషన్ 19, రెసిడెన్షియల్ 116, మైనారిటీ 126 కళాశాలలతో కలిపి మొత్తం 6,177 కళాశాలలు ఉన్నాయి. 2025లో పదో తరగతి పరీక్షలను 8,42,173 మంది రాశారు. మెయిన్స్‌లో 5,24,984 మంది, తొలి సప్లిమెంటరీలో 87,330, రెండో సప్లిమెంటరీలో 42,085 మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా గత ఏడాది 6,54,399మంది ఉత్తీర్ణులయ్యారు. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రథమ పీయూసీకి 7,72,402 సీట్లు అందుబాటులో ఉండగా 6,54,399 మంది మూడు పరీక్షలు కలిపి ఉత్తీర్ణులైనవారు ఉన్నారు. ఇలా 1,18,003 సీట్లు ఖాళీగా ఉన్నాయి.

విద్యావ్యవస్థలో మార్పులు తీసుకొచ్చామని పాలకులు గొప్పలు చెబుతున్నారు. సమాజంలో సంఖ్యకంటే గుణాత్మకత ముఖ్యమని విద్యానిపుణులు అభిప్రాయపడుతున్నారు. విద్యా వ్యవస్థలో దశాబ్దాలకాలంగా 7, 10 తరగతులకు పబ్లిక్ పరీక్షల సంప్రదాయం ఉంది. విద్యార్థులకు ఒత్తిడి తగ్గించాలనే ఉద్దేశంతో 7వ తరగతితో పబ్లిక్ పరీక్షలను తొలగించారు. ప్రస్తుతం 1వ తరగతిలో చేరితే పదో తరగతి దాకా అడ్డంకులు లేకుండా సాగుతారు. ఒకప్పుడు మార్చిలో ఫైనల్స్ పరీక్షలు జరిగితే సెప్టెంబరులో సప్లిమెంటరీ ఉండేది, దీని ప్రకారం ఓ ఏడాది వృథా అయ్యేది. వృథాను అరికట్టడానికి ప్రభుత్వం మార్చి కానీ ఏప్రిల్‌లో ఫైనల్స్ పరీక్షలు ముగియగా మే లేదా జూన్ మొదటివారంలో సప్లిమెంటరీ పరీక్షలు జరిపేవారు. గత విద్యాసంవత్సరం నుంచి పదో తరగతికి రెండు సప్లిమెంటరీలు నిర్వహించారు. అది కూడా జులై ఆఖరులోగా ముగించేలా అమలు చేశారు. దీని ప్రకారం ఒకే ఏడాది పదో తరగతికి మెయిన్‌తోపాటు రెండు సప్లిమెంటరీలు నిర్వహిస్తున్నారు. పైగా ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచి పదో తరగతి ఉత్తీర్ణతకు 35 మార్కులనుంచి 33కు తగ్గించారు. ఇంటర్నల్ మార్కులు 20 ఉంటాయి. మరో 13 మార్కులు సాధిస్తే పది ఉత్తీర్ణత కావడం సులువు కానుంది. ఇప్పటికే రాష్ట్రంలో పీయూ కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లు 1,18,003గా ఉన్నాయి. వచ్చే ఏడాది 33 మార్కుల వెసలుబాటు రెండు సప్లిమెంటరీలు కొనసాగిస్తే మరిన్ని సీట్లు ఖాళీగా మిగిలిపోయినా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు. సేవ పేరుతో విద్యావిధానం వ్యాపారంగా మారిపోతోంది.

కొత్త వాటికి అనుమతి ఇవ్వరాదు..

పీయూ కళాశాలల్లో లక్షకుపైగా సీట్లు ఖాళీ ఉండడం విద్యావ్యవస్థపై పెను ప్రభావం చూపనుందని, ఏకంగా వందకుపైగా కళాశాలలపై ప్రభావం చూపనుందని, విద్యార్థుల సంఖ్య తగ్గిందని, కళాశాలలు మూసివేయడం సాధ్యం కాదని, కొనసాగిస్తే మౌలిక సదుపాయాల అధ్యాపకుల వేతనాలు ఇతరత్రా ఖర్చులు భారం కానున్నాయని పీయూ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు మింగేగౌడ అభిప్రాయపడ్డారు. కనీసం 3-4ఏళ్లపాటు కొత్త కళాశాలలకు అనుమతులు ఇవ్వరాదని అన్నారు.



ఆసుపత్రిలో మేటి భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

బాగల్కోటె ఎమ్మెల్యే మేటికి సీఎం సిద్దరామయ్య నివాళి



మేటి (ఫైల్)

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కురుబ సామాజికవర్గానికి చెందిన బాగల్కోటె ఎమ్మెల్యే హుల్లప్ప యమనప్ప (హెచ్‌వై) మేటి (79) మంగళవారం కన్నుమూశారు. శ్వాసకోశ సమస్యలతో బెంగళూరు జయనగర్‌లోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన కోలుకుంటున్న తరుణంలోనే గుండెపోటు రావడంతో తుది శ్వాస వీడారు. 79ఏళ్ల హెచ్‌వై మేటి ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా, ఓసారి ఎంపీగా కొనసాగారు. 1989, 1992, 2004 గుళేదగుడ్డ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2013, 2023లో బాగల్కోటె నుంచి ఎమ్మెల్యే అయ్యారు. కురుబ సమాజంలో సుదీర్ఘ రాజకీయాలలో కొనసాగిన సీఎం సిద్దరామయ్య ఆప్తులలో ఒకరిగా పేరొందారు. 1994-96 వ్యవధిలో దేవేగౌడ ప్రభుత్వంలో అటవీశాఖ మంత్రిగా వ్యవహరించారు. 1996లో బాగల్కోటె ఎంపీగాను ఎన్నికయ్యారు. 2013లో ఎమ్మెల్యేగా గెలుపొంది సిద్దరామయ్య క్యాబినెట్‌లో అబ్కారీ శాఖ మంత్రిగా వ్యవహరించారు. 2016 డిసెంబరులో హెచ్‌వై మేటికి చెందిన ఓ అశ్లీల వీడియో వైరల్ అయ్యింది. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెడ్డపేరు వచ్చింది. ఆ వెంటనే ఆయన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఎంతోకాలంగా ఆప్తుడైనా ఈ వయసులో ఇలాంటివి అవసరమా..? సిగ్గుండాలి.... సంజాయిషీ కోసం మాట్లాడొద్దు... అంటూ సీఎం హోదాలో సిద్దరామయ్య మందలించిన అంశం బహిరంగమైంది. ఐదు నెలల తర్వాత వివాదం యూటర్న్ అయ్యింది. అయితే మేటిపై ఎక్కడా పోలీసు కేసు నమోదు కాలేదు. కానీ మరోసారి మంత్రిగా చేరే అవకాశం లభించలేదు. ప్రస్తుత క్యాబినెట్‌లో అవకాశం ఉంటుందని వ్యాఖ్యలు వినిపించినా మంత్రి కాలేకపోయారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మేటి పార్థివదేహానికి సీఎం సిద్దరామయ్య, మంత్రి మహదేవప్ప తదితరులు కడపటి నివాళి అర్పించారు. కాగా బాగల్కోటె జిల్లా తిమ్మాపుర గ్రామంలో లింగాయత సంప్రదాయాలతో బుధవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

భర్త మరణవార్త విని భార్య మృతి

7

- బాగల్కోటె జిల్లా బీళగిలో విషాదం
- అనాథలైన ఇద్దరు కుమారులు



శశిధర, సరోజ దంపతులు (ఫైల్)

కర్మాగారాలన్నీ కాంగ్రెస్ నేతలవే

- అందుకే గిట్టుబాటు ధర ఇచ్చేందుకు మనసు రావడం లేదు: చెరకు రైతుల నిరసనలో విజయేంద్ర
- ఫ్యాక్టరీ ఉంటే రైతుల కష్టాలు తెలియవా?: మంత్రి హెబ్బాళ్కర్ ఆగ్రహం



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చాలా వరకు చక్కెర ఫ్యాక్టరీలు కాంగ్రెస్ నాయకులవేనని, అందుకే చెరకు గిట్టుబాటు ధరపై వారికి ఆసక్తి లేదని బీజేపీ రాష్ట్రం అధ్యక్షుడు విజేయంద్ర మండిపడ్డారు. చెరుకుకు గిట్టుబాటు ధర కల్పించాలనే డిమాండ్‌తో రైతులు చేపట్టిన ఆందోళన మంగళవారం ఆరోరోజుకు చేరింది. బెళగావి జిల్లా మూడలగి తాలూకా గుర్లాపుర వద్ద ఐదు రోజులుగా రాత్రింబవళ్లు చెరుకు రైతులు నిరసన కొనసాగిస్తున్నారు. నిరసన చేస్తున్న చోటునే వంటలు చేసుకుని అక్కడే భోజనాలు చేస్తున్నారు. గోకాక్ పట్టణంలో రైతులతో కలసి విద్యార్థులు నిరసనలో కూర్చున్నారు. బెళగావి జిల్లా అంతటా నిరసన హోరెత్తుతున్నాయి. బెళగావి, సవదత్తి, మూడలిగ, యరగట్టిని చేరే అన్ని మార్గాల్లోనూ రవాణా అస్తవ్యస్థమైంది. చెరుకురైతుల సంఘం, కర్ణాటక రైతుసంఘం ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. గుర్లాపుర వద్ద జరుగుతున్న నిరసన శిబిరంలో బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర పాల్గొన్నారు. రైతులు ఆరు రోజులుగా రోడ్డుపైన ఆందోళన చేస్తున్నా ముఖ్యమంత్రికి బాధ్యత లేకుండా వ్యవహరిస్తున్నారని విజయేంద్ర మండిపడ్డారు. సాయంత్రంలోగా గిట్టుబాటుధర కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చెరుకు టన్నుకు రూ.2,700 చెల్లిస్తున్నారు. ధరల పెంపు ప్రస్తావన రావడంతో చెరుకు ఫ్యాక్టరీలు రూ.3,200 దాకా పెంచేందుకు సిద్ధమయ్యారు. అయితే చెరుకు రైతులు రూ.3,500 చెల్లించాల్సిందేనని పట్టుబడుతున్నారు. బెళగావి జిల్లాలో రాజకీయ పార్టీల ప్రముఖ నాయకులందరికీ చెరుకు ఫ్యాక్టరీలు ఉన్నాయి. జార్కిహొళి, కత్తి, హెబ్బాళ్కర్ కుటుంబాలకు చెందిన అత్యధిక ఫ్యాక్టరీలు ఉన్నాయి. దీంతో ఉద్యమానికి రాజకీయ మద్దతు లేనట్టయ్యింది. కానీ ఐదు రోజులుగా వేలాది మంది రైతులు నిరసన తెల్పుతుండడంతో బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర మంగళవారం పాల్గొన్నారు. చెరుకు రైతుల సమస్య పరిష్కారమయ్యేదాకా ఇక్కడే ఉంటానని విజయేంద్ర సవాల్ చేశారు. బుధవారం తన జన్మదిన వేడుకలను జరుపుకునేది లేదని, బెంగళూరుకు వెళ్లనన్నారు. వేలాదిమంది రైతులు నిరసన చెబుతుంటే తాను వేడుకలు చేసుకోవాలని భావించడం లేదన్నారు. నిరసనలో రాజ్యసభ ఈరణ్ణ కడాడి, ఎమ్మెల్యే దుర్యోధన ఐహొళె తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం బెళగావి జిల్లా అధికారి మహ్మద్‌రోషన్, ఎస్పీ బీమాశంకర్ గుళేద్‌లు ఆందోళన చేస్తున్న రైతులతో చర్చలు జరిపారు. రోడ్డుపై బైఠాయించడం ద్వారా రవాణాకు అంతరాయం ఏర్పడుతుందని, తద్వారా మరిన్ని సమస్యలు తలెత్తుతాయన్నారు. నిరసనకు వ్యతిరేకత లేదని, కానీ ఇతరులకు ఇబ్బంది సరికాదని సర్దుబాటు చేసే ప్రయత్నం చేశారు. రైతుల నిరసన మరింత ఉధృతమే అయ్యింది.

తానూ రైతునేనని, ఫ్యాక్టరీలు ఉన్నంత మాత్రాన చెరుకు రైతులకు అన్యాయం జరగనివ్వమని మంత్రి లక్ష్మిహెబ్బాళ్కర్ అన్నారు. బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ ఇతరత్రా పనులతో బిజీగా ఉన్నందున చెరుకు ఫ్యాక్టరీల యజమానులు, రైతుసంఘాల ముఖ్యుల సభకు వెళ్లలేదన్నారు. బీజేపీ నాయకులు నిరసనలో పాల్గొనడంపై స్పందిస్తూ ఇది రైతుల సమస్య అని, ఇక్కడ రాజకీయాలకంటే అందరికీ న్యాయం చేయడం ముఖ్యమన్నారు.



సమావేశానికి హాజరైన రైతులు



నో ఎంట్రీ

- రాజకీయ చర్చలకు అయితే ఎవరూ ఢిల్లీకి రావద్దు
- బిహార్ ఎన్నికల తర్వాతే సమావేశాలు
- నేతలకు అధిష్ఠానం ఆదేశం

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నవంబరు క్రాంతి అంటూ... రాష్ట్ర కాంగ్రెస్‌లో తలెత్తిన అంశంపై చర్చించేందుకు ఎవరూ ఢిల్లీకి రాకండి అంటూ పార్టీ అధిష్ఠానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. బిహార్ ఎన్నికలు ముగియగానే ఈనెల 15న ఢిల్లీ వెళ్తానని సీఎం ప్రకటించారు. అంతకంటే ముందే డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీ వెళ్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే మంత్రి సతీశ్‌జార్కిహొళి ఢిల్లీ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను భేటీ అయ్యేందుకు ఎక్కువ మంది రాష్ట్ర నేతలు ఉత్సాహం చూపుతున్నారు. అయితే ఇలా ఢిల్లీ వెళ్లేందుకు వరుస కడుతున్న వారిని అధిష్ఠానం హెచ్చరించింది. రాష్ట్ర రాజకీయాలకు సంబంధించి ప్రస్తుతం చర్చించలేమని, బిహార్ ఎన్నికల ఒత్తిడిలో ఉన్నామని హైకమాండ్ సూచించింది. మంత్రి సతీశ్ జార్కిహొళి ఢిల్లీలో మల్లికార్జున ఖర్గే, సుర్జేవాలా, కేసీ వేణుగోపాల్‌లను కలిసేందుకు సమయం కోరారు. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఉన్నామని, ఇది తగిన సమయం కాదని వారు స్పష్టం చేశారు. దీంతో సోమవారం ఢిల్లీ వెళ్లాల్సిన మంత్రి సతీశ్‌జార్కిహొళి బెళగావికే పరిమితమయ్యారు. ఆయన మంగళవారం చెరుకు రైతుల సమస్యలపై స్థానిక అధికారులతో చర్చలు జరిపినట్టు తెలుస్తోంది. చెరుకు రైతుల సమస్య తీవ్రమవుతున్న తరుణంలో ఢిల్లీ వెళ్లడం సముచితం కాదని భావించినట్లు సమాచారం. రాష్ట్రంలో సమస్యలపైనే నేతలు దృష్టిపెట్టాలని అధిష్ఠానం ఆదేశించినట్లు తెలుస్తోంది. అధిష్ఠాంన ఆదేశాలతో నాయకత్వ మార్పు చర్చలకు తెరపడినట్లు అయ్యింది.



దీపకాంతుల్లో దర్శనమిస్తున్న అమృతేశ్వరుడు



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా అమృతేశ్వరుడి కల్యాణం

బళ్లారి గాంధీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బళ్ళారి నగర శివారులో వెలసిన అమృతేశ్వర స్వామి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. పరమ పూజ్యులు శ్రీ మజ్జగద్గురు శంకర చార్యుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. మొదటి రోజు కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. అనంతనం స్వామివారికి తెప్పోత్సవం, దీపోత్సవం, స్వస్తివాచ సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. స్వామి వారి కళ్యాణోత్సవం తిలకించడానికి బళ్ళారి నగరం నుండే కాక చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు పాల్గొని స్వామి ధార్మిక కార్యాక్రమాలు తిలకించారు. బుధవారం శతరుద్రాభిషేకం, అలంకారము, బిల్వార్చనం, మహామంగళ హారతి, ఆకాశ దీపోత్సవం, ద్వాదశ మహా మంగళ హారతి నిర్వహించనున్నారు.

8 నుంచి మల్లేశ్వరంలో శనక్కాయల పరుష

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మల్లేశ్వరంలోని ప్రాచీన ఆలయం కాడుమల్లేశ్వర స్వామి గుడి ప్రాంగణంలో ఈనెల 8నుంచి శనక్కాయల పరుష జరగనుంది. ఈమేరకు పరుషకు సంబంధించి కాడుమల్లేశ్వర గెళెయర బళగ అధ్యక్షుడు బీకే శివరాం తెలిపారు. మంగళవారం ఆలయం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన ఈనెల 8నుంచి 10వ తేదీ వరకు మూడు రోజులపాటు పరుష జరగనుందన్నారు. సోమవారం ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు. ఇదే సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మీడియా సమావేశంలో అనూప్ అయ్యంగార్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో ఆలయ అధ్యక్షుడు బీకే శివరాం తదితరులు



పెరిగిన చిన్న ఉల్లి ధరలు

- హోసూరు మార్కెట్‌లో కిలో రూ.50

9

వేదవతిలో ఇద్దరు బాలుర గల్లంతు

ఏ విధి పగబట్టిందో...!

8 నెలల వ్యవధిలోనే తల్లిదండ్రుల మృతి
అనాథలుగా మారిన పిల్లలు


కుటుంబ సభ్యులతో వరలక్ష్మి

ముదిగుబ్బ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హాయిగా సాగుతున్న సంసారాన్ని విధి కాటేసింది. నెలల వ్యవధిలోనే తల్లిదండ్రులను బిడ్డలకు దూరం చేసి అనాథలను చేసింది. ముదిగుబ్బకు చెందిన ఓ కుటుంబ విషాద గాథ ఇది.. ముదిగుబ్బకు చెందిన శ్రీనివాసరెడ్డి(49) ఒక ప్రైవేటు సంస్థలో పనిచేసేవాడు. 8నెలల కిందట కూతురి ఇంటర్మీడియట్ పరీక్షల కోసం విజయవాడకు వెళ్లాడు. గుండెపోటు రావడంతో అక్కడే మరణించాడు. భార్య వరలక్ష్మి(40) నల్లచెరువు మోడల్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్నారు. భర్త మరణం, అనారోగ్య సమస్యలతో ఆమె తీవ్రంగా కుంగిపోయారు. ఈక్రమంలోనే ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా మారింది. దీంతో ఆమెను సోమవారం మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె హిమాన్షు విజయవాడలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా.. కుమారుడు కదిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పిల్లల ఆలనా పాలనా వారి చిన్నాన్న మురళి చూసుకుంటున్నట్లు తెలిపారు. ఏడాది వ్యవధిలోనే తల్లిదండ్రులు మరణించడంతో ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వంకలో పడి యువకుడి మృతి


బాబావలి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజిపల్లి గ్రామానికి చెందిన బాబావలి(32) ప్రమాదవశాత్తు వంకలో పడి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు...గ్రామానికి చెందిన బాబావలి ఓ డాబాలో వంట మనిషిగా పనిచేస్తు కుటుంబాన్ని పోషించేవాడు. పనికోసం డాబాకు వెళ్తున్నట్లు సోమవారం ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఈ క్రమంలో గ్రామ సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన ఉన్న ఎత్తైన కల్వర్టు నుంచి ప్రమాదవశాత్తు జారీ వంకనీటిలో మునిగిపోయాడు. మంగళవారం ఉదయం నీటిలో తేలాడుతున్న మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్యనజ్మున్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

ధర్మవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని కదిరి గేటు దగ్గరలో మంగళవారం ఉదయం ఓ గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతదేహంపై లేత నీలిరంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ఉన్నాయి. మృతుడి వివరాలు తెలిసిన వారు ధర్మవరం రైల్వే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. 8978656463, 9951325345 నంబర్లకు ఫోన్ చేయాలని రైల్వే పోలీసులు తెలిపారు.

ఏఎస్ఐనని చెప్పి మోసం

కుందుర్పి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తగా వచ్చిన ఏఎస్ఐని అంటూ సైబర్ నేరగాళ్లు కుచ్చుటోపీ పెట్టారు. మండల కేంద్రానికి చెందిన ఇద్దరికి మోసం చేశారు. స్థానికంగా పెట్రోల్ బంక్ నిర్వహిస్తున్న సుదర్శన్ రెడ్డి ఓ నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. తాను ఏఎస్ఐ ఆనందరావునని, కుందుర్పి స్టేషన్‌కు కొత్తగా వచ్చానని చెప్పారు. తమవారు ఆస్పత్రిలో ఉన్నారనీ, వెంటనే రూ.70 వేలు ఫోన్ పే చేయాలని ఓ నంబర్ ఇచ్చాడు. తరువాత పోలీసు స్టేషన్‌కు వచ్చి నగదు తీసుకెళ్లానన్నాడు. దానిని నమ్మిన సుదర్శన్ రెడ్డి ఆ మేరకు రూ.70 వేలు ఫోన్ పే చేశాడు. సమీపంలోనే సెల్‌పాయింట్ నిర్వహిస్తున్న అస్లాంబాషా అదే తరహాలో ఫోన్ చేసి, రూ.40 వేలు ఫోన్ పే చేయించుకున్నారు. తరువాత బాధితులిద్దరూ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఆనందరావు గురించి ఆరాతీయగా.. ఆ పేరుతో ఎవరూ లేరని చెప్పారు. దీంతో ఇద్దరూ అవాక్కయ్యారు. తమకు కాల్ వచ్చిన నంబర్‌కు ఫోన్ చేయగా.. పనిచేయలేదు. సైబర్ మోసంపై ఎస్ఐ నగేష్‌కు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దీప స్తంభంపై సంస్కృత శాసనం


సంస్కృత శాసనాన్ని చూపుతున్న చరిత్రకారుడు మైనాస్వామి, పరిశోధకుడు గోపి

కొత్తచెరువు,నవంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతదేవరపల్లి గ్రామ సమీపంలోగల లక్ష్మీచెన్నకేశవస్వామి గుడిలోని దీప స్తంభంపై సంస్కృత శాసనం గుర్తించినట్లు చరిత్రకారుడు మైనాస్వామి, పరిశోధకుడు గోపి మంగళవారం తెలిపారు. సంస్కృత శాసనంలో శుభమస్తు సంభూత దాత్రి తిత్వం ప్రరోహ అని ఉందన్నారు. (దీని అర్థం త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల కృపతో భూమండలం అభివృద్ధి చెందుతుంది.) గుడి ఎదురుగా ఉన్న రాతి పలక శాసనం తెలుగులో ఉందన్నారు. ఇందులో శాలివాహన శకం 1514 అంటే సామాన్య శకం1592 నాడు రాసినట్లు ఉందన్నారు. విజయనగర సామ్రాజ్య రెండో రాజధాని పెనుకొండ నుంచి పాలన సాగిస్తున్న అరవీటి వంశానికి చెందిన ఒకటో వెంకటపతి రాయల హయాంలో చేసిన భూ దాన అంశం ఇందులో రాసి ఉందని చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. ఈ ఆలయానికి 120 ఎకరాల మాన్యం ఉందని ఆలయ అర్చకులు మాధవాచార్యులు తెలిపారు.

మైనింగ్ ప్రాంతాల్లో డ్రోన్ సర్వే


డ్రోన్ సర్వే చేస్తున్న అధికారులు

డి.హీరేహాళ్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర సరిహద్దు మైనింగ్ ప్రాంతంలో అధికారులు డ్రోన్ సర్వే చేస్తున్నారు. సరిహద్దులు చెరిపేసి అక్రమ మైనింగ్ చేపట్టారని సుప్రీంకోర్టుకు ఫిర్యాదులు అందాయి. దీంతో సరిహద్దు సమస్యను తేల్చే విషయమై ప్రభుత్వం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసింది. వారంరోజులుగా రెవెన్యూ, అటవీశాఖ, మైనింగ్ ఇతర శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ సర్వేకు సంబంధించి ఏర్పాట్లను చేశారు. సోమవారం నుంచి మల్లప్పనగుడి గ్రామం సమీపంలో ఉన్న ఓఎంసీ మైనింగ్ కంపెనీ, అంతర్‌గంగా మైనింగ్ ప్రాంతాలలో సుమారు 100 ఎకరాలకుపైగా సర్వే చేపట్టారు. ఆయా మైనింగ్ కంపెనీల సరిహద్దులను డ్రోన్ పాయింట్ల ద్వారా గుర్తించారు. ఈ సర్వే ప్రక్రియ ఇంకా వారంరోజుల పాటు నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్వే రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ సూర్యారావు, రేంజ్ ఆఫీసర్ రామచంద్రుడు, డీఆర్ఓ దామోదర్‌రెడ్డి, సర్వేయర్ రవితేజ ఇతర అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీలకు కొత్తరూపు

క్లస్టర్‌కు మంగళం.. గ్రేడ్ల కుదింపు
జీఓ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీల ముఖచిత్రం మారనుంది. అందుకు అనుగుణంగా ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ జీఓ ఎంఎస్‌నెంబర్.91ను మంగళవారం విడుదల చేశారు. దీని ప్రకారం ఇప్పటి వరకు ఉన్న క్లస్టర్ వ్యవస్థకు మంగళం పాడనున్నారు. గ్రేడ్లను కూడా కుదించి నాలుగింటికి పరిమితం చేయనున్నారు. పంచాయతీలను స్వతంత్ర యూనిట్‌గా ప్రకటించారు. జిల్లాలో ఉన్న 577 పంచాయతీలకుగాను స్పెషల్‌గ్రేడ్ పంచాయతీలు -14, గ్రేడ్-1 పంచాయతీలు-62, గ్రేడ్-2 పంచాయతీలు-218, గ్రేడ్-3 పంచాయతీలు-283గా నిర్ణయించారు. అందుకు అనుగుణంగా సిబ్బందిని నియమించడం కోసం యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పంచాయతీ సెక్రటరీ పేరును కూడా పీడీఓ (పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్)గా మార్చనున్నారు. స్పెషల్ గ్రేడ్ పంచాయతీలకు సంబంధించి డిప్యూటీ ఎంపీడీఓ కేడర్ అధికారులను నియమించనున్నారు. పంచాయతీలకు ప్రతి విభాగం నుంచి ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నారు. పారిశుధ్యం, నీటి సరఫరా, కంట్రీప్లానింగ్, వీధి దీపాలు, ఇంజనీరింగ్, రెవెన్యూ తదితర విభాగాలతో నూతనంగా సిబ్బందిని నియమించనున్నారు. పంచాయతీలను మొత్తం డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ఐటీ విభాగాన్ని కూడా అమలులోకి తీసుకురానున్నారు. దీంతో పంచాయితీల ముఖచిత్రం మొత్తం మారనుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమలులోకి తీసుకురానున్నారు.

క్రీడల నిర్వహణను సవాల్‌గా తీసుకోవాలి

సమష్టిగా పనిచేసి విజయవంతం చేయాలి
కలెక్టర్ ఆనంద్


సూచనలిస్తున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక పోటీల నిర్వహణను సవాల్‌గా తీసుకుని, విజయవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. పోటీల నిర్వహణపై స్థానిక ఆర్డీటీ స్టేడియంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... పోటీల నిర్వహణ ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలన్నారు. అన్ని జిల్లాల నుంచి వచ్చే ఉద్యోగులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సీసీఎల్ఏ విజయలక్ష్మి, మంత్రులు హాజరవుతారన్నారు. ఏపీ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి 3వేల మంది పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. అనంతరం వేదిక, స్టేడియం, భోజనం, వసతి సదుపాయాల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, అహుడా కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, ఇరు జిల్లాల అధ్యక్షులు దివాకర్‌రావు, మధునాయక్, ఏఎంసీ కమిషనర్ బాలస్వామి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దీప్తి, మల్లికార్జున, ఆనంద్ పాల్గొన్నారు.

దారి తప్పిన గురువు

విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన
పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన
సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు


ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు వినతిపత్రాన్ని ఇస్తున్న గ్రామస్థులు

వజ్రకరూరు(ఉరవకొండ)/అనంతపురం విద్య, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు దారి తప్పాడు. తన వికృత చేష్టలతో వారిని వేధించసాగాడు. కొన్నాళ్లు మౌనంగా భరించిన పిల్లలు చివరకు వాటిని తాళలేక తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో వారు ఆగ్రహంతో పాఠశాలకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడి వికృత చేష్టలపై ఇన్‌చార్జ్ హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి జడ్పీ హైస్కూల్లో జరిగింది. వివరాలు ఇలా... పాఠశాలలో ఎస్ఏస్ టీచర్‌గా పని చేసే సుధాకర్ కొంతకాలంగా విద్యార్థులతో వికృతంగా ప్రవర్తించేవాడు. పిల్లల ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడి తీరును నిరసిస్తూ పాఠశాల వద్ద మంగళవారం ఆందోళనకు దిగారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జగదీష్‌కు విన్నవించారు. ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై నాలుగు రోజుల కిందటే తల్లిదండ్రులు ఫిర్యాదు చేయగా వారికి హెచ్‌ఎం సర్ది చెప్పినట్లు తెలిసింది. ఈక్రమంలో ఉపాధ్యాయుడు సుధాకర్ కూడా సెలవులో వెళ్లాడు. అయితే మంగళవారం ఆయన పాఠశాలకు వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు తల్లిదండ్రులు, గ్రామస్థులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎంఈఓ పాఠశాలకు చేరుకుని, విద్యార్థులను విచారించారు. పిల్లల అభిప్రాయాలను తీసుకున్నామని, నివేదికను జిల్లా విద్యాశాఖాధికారులకు పంపుతున్నట్లు ఎంఈఓ తెలిపారు.

టీచర్ సుధాకర్ సస్పెన్షన్

క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నివేదికను పరిశీలించిన జిల్లా ఉన్నతాధికారులు ఉపాధ్యాయుడు సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్ద గొడవకు దిగడం, మంత్రి పయ్యావుల కేశవ్ సొంత నియోజకవర్గం కావడంతో అధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. సమస్య కలెక్టరు, కమిషనర్ దృష్టికి వెళ్లడంతో వెంటనే ఉపాధ్యాయుడు సుధాకర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు ప్రకటించారు.

గొడవ నిజమే..!

హెచ్‌ఎం, ఉపాధ్యాయిని మధ్య వార్ వాస్తవమే
వజ్రకరూరు హైస్కూల్‌లో వివాదంపై విచారణ

అనంతపురం విద్య, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వజ్రకరూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలి మధ్య గొడవ నిజమేనని తేలింది. పాఠశాలలో జరుగుతున్న రగడ గురించి రాష్ట్రవిద్యాశాఖ ఉన్నతాధికారుల దృష్టికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో వారు ఇంత జరుగుతుంటే ఏమి చేస్తున్నారని జిల్లా విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు వజ్రకరూరు హైస్కూల్ వివాదంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డిని ఆదేశించారు. ఆయన మంగళవారం వజ్రకరూరు హైస్కూల్‌కు వెళ్లి, ఉదయం నుంచి సాయంత్రం వరకు హెచ్‌ఎం, టీచర్లు, ఇతర నాన్‌టీచింగ్ సిబ్బందితో మాట్లాడారు. అనంతరం హెచ్‌ఎం, గొడవ పడుతున్న టీచరమ్మతో పాటు ఇతర టీచర్లతో విడివిడిగా మాట్లాడి, జరుగుతున్న సంఘటనలపై ఆరాతీశారు. టీచరమ్మపైనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చినట్లు సమాచారం. హెచ్‌ఎం కూడా అందరినీ కలుపుకొని పోవడం లేదని విచారణలో వెల్లడైనట్లు సమాచారం. దీనిపై విచారణాధికారి మల్లారెడ్డిని అడగగా, విచారణ చేశామని, అక్కడ వివాదం వాస్తవమేనని, దీనిపై నివేదికను డీఈఓకు అందజేస్తానని తెలిపారు.

ఢిల్లీలో సైన్స్ ఎగ్జిబిషన్‌కు
అనంత విద్యార్థిని


విద్యార్థినిని అభినందిస్తున్న కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనకనహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గీతారెడ్డి ఢిల్లీలో నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. అంతరిక్షశాస్త్రంపై ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే పాల్గొననుందని పాఠశాల హెచ్‌ఎం వేణుగోపాల్ తెలిపారు. ప్రతి జిల్లా నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా.. అందులో గీతారెడ్డికి అవకాశం దక్కింది. విద్యార్థినిని అనంతపురం రైల్వే స్టేషన్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మంగళవారం అభినందించారు. సైన్స్ ఉపాధ్యాయులు చంద్రమునయ్య, మేడా ప్రసాద్ అభినందనలు తెలిపారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా టేబుల్‌టెన్నిస్ క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా టేబుల్‌టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పాండురంగయ్య, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. క్రీడాకారుల ఎంపిక పోటీలను నగరంలోని సప్తగిరిసర్కిల్‌లో ఉన్న అనంతపూర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించినట్లు తెలిపారు. అండర్-15 బాలుర విభాగంలో ఆదిత్య, చేతన్‌మురళీ, డి. ఫిరోజ్, ఆశ్రిత్, విశ్వనాథ్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో ఈషాసంజన, జ్ఞాపిక, హాసిని, ఐశ్వర్య, క్షిప ఎంపికయ్యారు. సీనియర్ పురుషుల విభాగంలో కుషాల్, సాయిషా, వంశీకృష్ణ, జయాద్, గౌతమ్ ఎంపికయ్యారు. వీరు ఈనెల 17 నుంచి విశాఖపట్నంలో నిర్వహించే ఏపీ రాష్ట్ర టేబుల్‌టెన్నిస్ చాంపియన్‌షిప్-2025 పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు రాజశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్, నజీమ్ పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనలో
జిల్లాకు అన్యాయం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కరువు మండలాల ప్రకటనలో జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చాక గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కూడా భారీగా పంట నష్టం వాటిల్లిందన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులు మాట్లాడలేదన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లోనైనా ఆదుకుంటారనుకుంటే మొండిచేయి చూపారన్నారు. ఖరీఫ్‌లో జూన్ 5 నుంచి ఆగస్టు తొలివారం వరకు 55 రోజులపాటు జిల్లాలో వర్షం కురవలేదన్నారు. సీజన్‌లో నాలుగు నెలలను పరిగణనలోకి తీసుకుని సాధారణ వర్షపాతంగా ప్రభుత్వానికి నివేదిక పంపి, రైతాంగాన్ని నట్టేట ముంచారని మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లాలో 25 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రభుత్వం పక్కనే ఉన్న అనంతపురంలో ఒక్క మండలానికీ జాబితాలో చోటివ్వలేదన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీతో పప్పుశనగ విత్తన పంపిణీలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా పునఃసమీక్ష చేసి కరువు మండలాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివాదాలు, అవినీతి బురదలో కూరుకుపోయి.. దానిని అందరికీ అంటించాలని చూస్తున్నారన్నారు. తాను సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నాననీ, ఇలా వివాదాలు, అవినీతి బురదలో దిగిన వారిని చూడలేదన్నారు. అక్రమాలపై ప్రశ్నిస్తే తనపై విమర్శలు చేస్తున్నారనీ, బెదిరించి మాట్లాడకుండా గొంతు నొక్కుతామంటే భయపడే వాడిని కాదన్నారు. ముగ్గురు అన్నదమ్ములం కలిసే ఉన్నామనీ, తమకు 450 ఎకరాలు ఎక్కడున్నాయో చూపించి ఇస్తే మంచిదే అన్నారు. తన పక్కనున్న ఒకరిద్దరు కట్టప్పల మాటలు విని ఏదంటే అది మాట్లాడితే భయపడేవాడిని కాదన్నారు. అందరికీ బుద్ధి చెబుతానని అనంత హెచ్చరించారు.

పీఏబీఆర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

కూడేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్(పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్)కి ఇన్‌ఫ్లో పెరిగింది. రెండు రోజులుగా డ్యాంలోకి హంద్రీ-నీవా నుంచి 660 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో జల విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. డ్యాంలోకి హంద్రీనీవాతోపాటు లింక్ చానల్ నుంచి వస్తున్న నీరు దాదాపు 700 క్యూసెక్కులుగా ఉంది. జల విద్యుత్ కేంద్రంలో ఒక టర్బైన్‌కు 785 క్యూసెక్కుల నీటిని నియోగిస్తూ కరెంటు ఉత్పత్తి చేస్తున్నారు. ఇన్‌ఫ్లో ఆధారంగా ఔట్‌ఫ్లో కొనసాగిస్తున్నట్లు ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం డ్యాంలో 5.157 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

నేడు ఈ ప్రగతి యాప్‌పై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ ప్రగతి యాప్ వినియోగంపై బుధవారం శిక్షణ ఇవ్వనున్నట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక జూనియర్ అసిస్టెంట్ లేదా టైపిస్టు లేదా కంప్యూటర్ ఆపరేటర్లలో ఎవరో ఒకరు శిక్షణ పొందాలన్నారు. దీనిపై ఆయా మండలాల ఎంపీడీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ శిక్షణను జడ్పీ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రం సమావేశ భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

ఆంధ్ర జట్టుకు ముగ్గురు జిల్లా క్రికెటర్లు


ఎంకే దత్తారెడ్డి


మహ్మద్ కమిల్


మల్లికార్జున

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అండర్-23 వన్డే క్రికెట్ జట్టుకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రికెటర్లు ఎంపికయ్యారు. మహ్మద్‌కమిల్, ఎంకే దత్తారెడ్డి, మల్లికార్జున చోటు దక్కించుకోగా.. స్టాండ్‌బైగా అర్జున్ టెండూల్కర్‌ను ఎంపిక చేశారు. వీరు ఈనెల 9 నుంచి బరోడాలో నిర్వహించే అండర్-23 జాతీయస్థాయి వన్డే క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు తరఫున ఆడతారు. వీరిని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

ఎదురీదుతున్న పాండిచ్చేరి


ఆల్‌రౌండర్ రాజు



కిషన్‌యాదవ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): సీకే నాయుడు జాతీయ క్రికెట్ టోర్నీలో భాగంగా ఆంధ్ర అండర్-23 జట్టుతో జరుగుతున్న పోరులో పాండిచ్చేరి జట్టు ఎదురీదుతోంది. పాండిచ్చేరి-ఆంధ్రా అండర్-23 జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 184-3తో ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్రా జట్టు 9వికెట్లు కోల్పోయి 341పరుగల వద్ద డిక్లేర్ చేసింది. బ్యాటర్ తేజ (105) సెంచరీ చేయగా, అభినవ్ 48పరుగులు, రాజు 55పరుగులు, ఆకాష్ 35పరుగులు చేశారు. పాండిచ్చేరి బౌలర్ కిషన్‌యాదవ్ 6వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో 14.3ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 37పరుగులు చేసింది. ఆంధ్రా బౌలర్ 3వికెట్లు తీయగా, సుమిత్ వికెట్ తీశాడు. దీంతో చివరి రోజు ఆటపై ఆసక్తి నెలకొంది. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగా రెడ్డి, సభ్యులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


ఎంపికైన ఎస్‌జీఎఫ్ అండర్-14 నెట్‌బాల్ జిల్లా బాల బాలికల జట్లు

నెట్‌బాల్ బాల బాలికల జట్ల ఎంపిక


ఎంపికైన ఎస్‌జీఎఫ్ అండర్-19 నెట్‌బాల్ జిల్లా బాల బాలికల జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్-14, 19 బాల, బాలికల జిల్లా జట్లను మంగళవారం ఎంపిక చేశారు. స్థానిక న్యూటౌన్ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఎస్‌జీఎఫ్-14, 19 నెట్‌బాల్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

- అండర్-14 బాలికల విభాగంలో సుకన్య, మధు, శ్రీజ, అమృత, హర్షిత, దీపాలి, రాఘవశ్రీ, నవ్య, సానియా, సునీత, సౌమ్య, నేత్రలు ఎంపికయ్యారు.
- బాలుర విభాగంలో పవన్‌కుమార్, నవాజ్, మోక్షిత్, రాజు, కార్తీక్, మధుసాయి, భరత్, బాబ్జాన్, మనోజ్, తేజ్‌కుమార్, నరేంద్ర, ధనుంజయ ఎంపికయ్యారు.
- అండర్-19 బాలికల విభాగంలో దీపిక, నందిని, సృజన, పూజ, అలియా అంజుం, హస్వికి, సంయుక్త, కల్పన, అమృత, చైత్ర, శుభాశ్రీ, గీతలు ఎంపికయ్యారు.
- బాలుర జట్టులో నరేంద్ర, జాఫర్, ప్రణీత్‌కుమార్, చరణ్, నాగచైతన్య, హరికృష్ణ, బాబా, అశోక్, రామ్‌చరణ్, కార్తీక్, చేతన్, నానిలు ఎంపికయ్యారు.

కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు శకుంతల, లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు రవీంద్ర, వేణు, చరణ్, సునీల్, ఈశ్వర్‌రెడ్డి,, గోవిందు, రమేష్ పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి: ఎస్ఈ

అనంతపురంరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విధుల్లో అప్రమత్తంగా ఉంటూ పనిచేయాలని విద్యుత్ శాఖ ఎస్ఈ శేషాద్రి శేఖర్ సూచించారు. మంగళవారం జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ శాఖ ప్రధాన కార్యాలయం మీటింగ్ హాల్‌లో అనంతపురం డివిజన్ పరిధిలోని సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు, జేఎల్‌ఎంలు, పోల్‌టూపోల్ సిబ్బందికి విద్యుత్ భద్రతపై వర్క్‌షాపు నిర్వహించారు. డివిజన్ ఈఈ జేవీ రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎస్ఈ శేషాద్రి శేఖర్, టెక్నికల్ ఈఈ ప్రసాద్, అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లావణ్య, ఏపీటీఎస్ సీఐ విశ్వనాథ్‌చౌదరి హాజరయ్యారు. ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ మరమ్మతుల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్న తప్పిదాలు కూడా పెద్ద ప్రమాదాలకు దారి తీస్తాయన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ లావణ్య ఈశ్రామ్, ఇతర బీమా పథకాల గురించి వివరించారు. అనంతరం సిబ్బందికి సేఫ్టీ కిట్లను అందజేశారు. కమర్షియల్ విభాగం డీఈఈ రామకృష్ణ, ఆపరేషన్ డీఈఈలు శ్రీనివాసులు, చంద్రశేఖర్, రఘు పాల్గొన్నారు.

కోట స్థలం ఆక్రమణలు అడ్డుకోండి

● జిల్లా అధికారులకు పురావస్తు శాఖ కమిషనర్ ఆదేశం

రాయచూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక కోట పరిసరాలు అక్కడి స్థళాలను కబ్జా చేయకుండా స్థానిక అధికారులు అడ్డుకోవాలని పురవస్తు శాఖ కమిషనర్ దేవరాజ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. మహానగర పాలిక ప్రత్యేక అధికారి జుబేన్ మొహపాత్రతో కలిసి మంగళవారం రనగరంలోని కోట పరిసరాలను కమిషనర్ పరిశీలించారు. మహానగర పాలిక వివిధ శాఖల అధికారులతో సమావేశమైన పురవస్తు శాఖ కమిషనర్ అధికారులతో కలిసి స్థానిక మెక్కా దర్వాజా తదితర చారిత్రక ప్రాంతాలతో పాటు కందకం పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల నిర్మాణానికి అనువుగా లేని స్థళాల్లో సహితం కొంతమంది నిర్మాణాలు సాగిస్తుండడాన్ని గమనించిన అధికారి ఈ విషయంలో స్థానిక అధికారులు అప్రమత్తం కావాలని ఆదేశించారు.

అరటి ఆధారిత
వస్తువుల తయారీపై శిక్షణ

పుట్లూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అరటి ఆధారిత వస్తువుల తయారీ యూనిట్ల ఏర్పాటుపై జిల్లాలో ఆసక్తి కలిగిన యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని ఐకేపీ కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ నెల 6న రాప్తాడులోని టీటీడీసీలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరటి పంట తర్వాత వేస్ట్‌గా తీసివేసిన భాగాల నుంచి దాదాపు 12రకాల వస్తువులను తయారు చేసి మార్కెట్ చేయవచ్చునన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఇటువంటి యూనిట్లు ఇంటిలోనే ఏర్పాటు చేసుకొని ఖాళీ సమయంలో రోజుకు రెండుగంటలు పనిచేస్తే నెలకు రూ.15వేల నుంచి 20వేల వరకు సంపాదించుకొనే అవకాశం ఉందన్నారు. దీనికి అయ్యే పెట్టుబడిని రుణం రూపంలో తామే ఇస్తామన్నారు. ఇచ్చిన రుణానికి 50శాతం సబ్సిడీ కూడా ఉంటుందన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామత్...

ఆలూరి బైరాగి (జయంతి)



ప్రముఖ రచయిత, తెలుగు కవి ఆలూరి బైరాగి 1925 నవంబరు 5న తెనాలి తాలూకాలో జన్మించారు. 15వ యేట హిందీలో కవితలు రాసి కవి సమ్మేళనాలలో పాల్గొన్నారు. ఆయన తొలి కవితా సంకలనం 'చీకటి నీడలు' ప్రచురించారు. మానవతావాదిగా పేరొందిన ఆయన 1978 సెప్టెంబరు 9న కన్నుమూశారు. మరణానంతరం 1984లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించారు.

దాశరథి (వర్ధంతి)



'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గర్వంగా ప్రకటించి ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన కవి, 'కళాప్రపూర్ణ' బిరుదాంకితులు దాశరథి కృష్ణమాచార్య వరంగల్ జిల్లా చిన్నగూడూరు 1925 జూలై 22న జన్మించారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను 'అగ్నిధార'గా మలిచి నిజాంపాలనపై ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకుని తెలంగాణ విముక్తికోసం ఉద్యమించిన ప్రాతఃస్మరణీయుడు. ఉపాధ్యాయుడిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసినా సాహిత్యంలో పలు ప్రయోగాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు అందుకున్నారు. 1987 నవంబరు 5న కన్నుమూశారు.

వందన శివ (పుట్టినరోజు)



భారతీయ పండితురాలు, పర్యావరణ కార్యకర్తగా పేరొందిన వందన శివ 1952 నవంబరు 5న డెహ్రాడూన్‌లో జన్మించారు. ప్రపంచీకరణ వ్యతిరేక రచయిత. 20 పైగా పుస్తకాలను రచించారు. రైట్ లైవ్లీహుడ్ అవార్డు అందుకున్నారు. ఈ పురస్కారాన్ని 'ప్రత్యామ్నాయ నోబెల్ అవార్డు'గా పరిగణిస్తారు. సుస్థిర జీవనంకోసం బీజా విద్యాపీఠ్ అనే అంతర్జాతీయ కళాశాలను ప్రారంభించారు.

విరాట్‌కోహ్లి (పుట్టినరోజు)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత, అంతర్జాతీయ క్రికెటర్ విరాట్ కోహ్లి 1988 నవంబరు 5న జన్మించారు. అండర్ 19 కేటగిరీలో మలేషియాలో 2008లో ప్రపంచ కప్ విజయంలో భారతజట్టుకు సారథిగా వ్యవహరించారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మన్, ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా కూడా ఆడగలడం ప్రత్యేకత. టెస్ట్ క్రికెట్ కెప్టెన్‌గాను వ్యవహరించారు. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడారు. పలు స్వచ్ఛంద సంస్థలతో కలసి సామాజిక సేవలందిస్తున్నారు. 2024 టి20 వరల్డ్‌కప్‌లో ఇండియా విజయం సాధించాక ఆయన టి20 ఇంటర్నేషనల్ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు.

అభివృద్ధికి నోచుకోని క్రీడామైదానం

» నరేగా కింద ప్రారంభం... మూడేళ్లుగా నిర్లక్ష్యం



పిచ్చిమొక్కలతో నిండిన ప్రదేశం

బంగారపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బంగారపేట తాలూకా బూదికోటె హోబళి యళెసంద్ర గ్రామపంచాయతీ పరిధిలోని దినకొత్తూరు గ్రామంలో క్రీడా మైదానంకోసం ఉద్దేశించిన భూమి నిర్లక్ష్యంగా వదిలేశారు. మూడేళ్లక్రితం భూమిపూజతో పనులు చేపట్టి ఆపై పట్టించుకోలేదు. దీంతో ఈ ప్రదేశం పిచ్చిమొక్కలతో నిండి అటవీప్రాంతంగా మారింది. సర్వే నెంబరు 30లో గోమాళ భూమి ఉంది. ఈ ప్రాంతాన్ని క్రీడామైదానం కోసం కేటాయించాలని గ్రామస్తులు పంచాయతీకి విన్నవించారు. అనంతరం నరేగా పథకం కింద పనులు చేపట్టి నిలిపివేశారు. ప్రారంభంలో చేపట్టిన పనులకు అప్పట్లో బిల్లులు చేశారు. అయితే నెలలు, సంవత్సరాలు గడిచినా పట్టించుకోలేదని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు. దీంతో క్రీడలకు కనీసంగా మైదానం కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, గ్రామానికి చెందిన యువత అసంతృప్తి వ్యక్తం చేశారు. మైదానప్రాంతంలో పిచ్చిమొక్కలు ఇతర చెట్లు భారీగా పెరిగి విషప్రాణులకు నెలవుగా మారిందన్నారు. సాధ్యమైనంత త్వరగా క్రీడామైదానాన్ని అభివృద్ధి చేసి వాకింగ్ ట్రాక్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గ్రామ యువత

క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో రాణించాలి

» ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరాజు



క్రీడాపోటీల ప్రారంభోత్సవంలో ఒలింపిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరాజు తదితరులు

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు నైపుణ్యత, ఆత్మవిశ్వాసంతో రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందరాజు పిలుపునిచ్చారు. మినీ కర్ణాటక గేమ్స్‌లో భాగంగా మంగళవారం హలసూరు చెరువులో ఏర్పాటు చేసిన 'కయా కింగ్- కనోయింగ్' క్రీడాపోటీలను తిలకించారు. సిట్ ఇన్ కయాక్ సింగిల్స్, కయాక్ డబుల్స్, కయాక్ సాలమ్ బోట్లను పరిశీలించారు. ఈ బోట్‌లు అసోసియేషన్ పరిధిలోనే ఉంటాయని, ఇక నిరంతరంగా ఇటువంటి పోటీలు కొనసాగిస్తామన్నారు. కయాకింగ్ బాయ్స్ విభాగంలో బెంగళూరు గ్రామీణ ఆది గోల్డ్ ప్రైజ్‌ను, బెంగళూరు నగర లలిత్ రజత పతకం, కోలారు సిద్దాంత్ కాంస్యపతకం గెలుపొందారు. బాలికల విభాగంలో బెంగళూరు అర్బన్ అద్వైత బంగారు బహుమతిని, కోలారు తేజ రజతం, బెంగళూరు గ్రామీణ హరిని కాంస్యం బహుమతులు గెలుచుకున్నారు.

సహస్రచండీయాగం ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

దొమ్మసంద్ర, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతిని పురస్కరించుకుని హృదయస్పందన సంస్థ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం సహస్రచండీయాగం ప్రారంభమైంది. మంగళవారం ప్రారంభమైన ధార్మిక కార్యక్రమాలు ఐదురోజులపాటు కొనసాగనున్నాయి. గురుప్రార్థన, మహాగణపతిపూజ, మహాసంకల్ప, చండీకలశస్థాపనతో కార్యక్రమాలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన వందమందికిపైగా రుత్వికులు పాల్గొని సప్తశతి పారాయణ, సర్వవేద పారాయణ, సహస్ర కలశాభిషేకం నిర్వహించారు. ట్రస్టీ సత్యసాయిప్రసాద్ మాట్లాడుతూ సురభారతి సంస్థ ముఖ్యులు శ్రీనివాసన్ నేతృత్వంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ సాయంత్రం కళాకారులచే భజన, ఇంకా త్యాగరాజపంచగోష్టి గాయనం, మల్లాడి సూరిబాబు నేతృత్వంలో భద్రాచల రామదాసు కృతుల గాయనం ఉంటుందన్నారు. మరో ట్రస్టీ సాయిరాం హరిశంకర్ మాట్లాడుతూ ముగింపురోజు 9న పూర్ణాహుతి ఉంటుందన్నారు. తొలిరోజు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ జీర్ణోద్ధరణ



రామచంద్రగౌడ తదితరులకు సన్మానం

శిడ్లఘట్ట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటె సర్కిల్‌లోగల సోమేశ్వరస్వామి దేవాలయ జీర్ణోద్ధరణ సంప్రోక్షణ కార్యక్రమాలు ఘనంగా సోమవారం జరిగాయి. వేదఘోష, మంత్రపఠనం, నాదస్వరం నడుమ పంచగవ్య పంచామృతాభిషేకం, కుంభాభిషేకం, ఇతర ధార్మిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమేశ్వరస్వామికి విశేషపూజలు, అలంకరణ చేశారు. బీజేపీ చిక్కబళ్ళాపుర జిల్లాఅధ్యక్షుడు సీకల్ రామచంద్రగౌడ సహా పలువురు ప్రముఖులు ఉత్సవాలలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రముఖులను, దాతలను సత్కరించారు. సీకల్ రామచంద్రగౌడ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం రాతితో కొనసాగడంతో శాశ్వతమైన పనులు జరిగాయన్నారు. ఆలయ అభివృద్ధికి డాల్ఫిన్ నాగరాజ్ నేతృత్వంలో ట్రస్టు సభ్యులు పార్టీలకు అతీతంగా కృషి చేశారన్నారు.

కార్తీక ప్రత్యేక పూజలు

ముళబాగిలు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కార్తీక శుక్ల చతుర్థశిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాలలో ప్రత్యేకపూజలు కొనసాగాయి. శివకేశవ నగర్‌లోని పురాణ ప్రసిద్ధమైన ఉద్భవ శివలింగేశ్వర ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి అలంకరణ చేశారు. ముత్తైదువులు దీపారాధన చేశారు. మధ్యాహ్నం తీర్థప్రసాదాలు పంపిణీ చేసి అన్నసంతర్పణ నిర్వహించారు. అర్చకులు అనంతశాస్త్రి నేతృత్వంలో ధార్మిక కైంకర్యాలు కొనసాగాయి. కాగా తాలూకాలోని కదరీపుర గ్రామంలో కొలువైన పురాణ ప్రసిద్ధ కంబద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ విశేషపూజలు, అలంకరణ చేశారు.



ఉద్భవ శివలింగేశ్వరుడికి అలంకరణ



కంబద లక్ష్మీనరసింహస్వామికి అలంకరణ

విద్యతోపాటు ఆటపాటలు అవసరం

» రీడ్ టు రూం బృందం సంచాలకుడు జగదీశ్

విజయపుర, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా మీకు ఇష్టమైన ఆటపాటల్లో పాల్గొని రాణించాలని రీడ్ టు రూం బృందం సంచాలకులు జగదీశ్ పేర్కొన్నారు. క్రీడలు, చిత్రలేఖనం, జ్ఞానాభివృద్ధికి సంబంధించిన ఆటలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలోని ప్రభుత్వ మాదిరి బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటైన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ మార్కెటింగ్ కార్పొరేషన్, రీడ్ టు రూం బృందం ఏర్పాటు చేసిన చిత్రకళా పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేసి మాట్లాడారు. రీడ్ టు రీం బృందం సహాయకులు నాగేశ్ మాట్లాడుతూ పిల్లలకు చిత్రాలు చూపించడం, చిత్రకథలను చదివించడం ద్వారా వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడుతుందన్నారు. అదేరీతిన పఠనాసక్తి పెంచుకోవాలన్నారు. ఇందుకు గ్రంథాలయాలు ఎంతో సహకరిస్తాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ మాట్లాడుతూ విద్య అనేది సాధకుల సొత్తు అన్నారు. నిరంతర సాధనతోనే సాధ్యమన్నారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, హరీశ్, ముద్దరంగప్ప, మాధవి, ద్రాక్షాయిణి, మమతా, సీమా, శోభ తదితరులు పాల్గొన్నారు. మార్చి నెలలో జాతీయస్థాయి పోటీలలో 10 రాష్ట్రాలకు చెందిన పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కర్ణాటక రాష్ట్రం నుంచి బళ్ళారికి చెందిన ఒక పాఠశాల, విజయపుర పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఇక్కడి పాఠశాలకు చెందిన 50మంది విద్యార్థులు భాగస్వాములయ్యారు. రాష్ట్రానికి చెందిన రెండు బహుమతులు పాఠశాలకు చెందిన కీర్తి, కృష్ణశ్రీలు గెలుపొందారు. మరో 14మందికి ప్రశంసాపత్రాలు అందచేశారు. మిగిలినవారికి కన్సొలేషన్ బహుమతులు ప్రదానం చేశారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

'కంప్యూటర్ ఆధారిత జ్ఞానం ముఖ్యం'



వర్చువల్ ల్యాబ్‌లో విద్యార్థులు

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ ఆధారిత జ్ఞానం ముఖ్యమని ప్రస్తుత సమాజం పూర్తిగా డిజిటల్ రంగంలో కొనసాగుతోందని డాక్టర్ ఏపీ భట్ అభిప్రాయపడ్డారు. నాగసంద్రలోని పూర్ణప్రజ్ఞ పీయూ కళాశాలలో వర్చువల్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. కామర్స్ విద్యార్థులకు వీలుగా బ్యాంకింగ్ పరీక్షలైన ఐబీపీఎస్‌లో శిక్షణకు కీలకమన్నారు. వర్చువల్ ల్యాబ్ ప్రయోజనకరం కానుందన్నారు. కళాశాల కార్యదర్శి గోపాల శబరాయ, ప్రిన్సిపాల్ ఉమేశ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో పగలే హత్య

బెంగళూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో పట్టపగలు మరోహత్య జరిగింది. కిత్తగానహళ్ళిలో మంగళవారం ప్రావిజన్‌స్టోర్ యజమాని మాదేశ్ (35) ఇంటికి వెళ్లిన దుండగులు ఎయిర్‌గన్‌తో బెదిరించారు. గొంతుకోసి హత్యచేసి పరారయ్యారు. హెబ్బగూడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మాదేశ్ హత్యకు గల కారణాలను వెలికి తీస్తున్నారు. సంఘటనలో ఎంతమంది పాల్గొన్నారనే కోణంలోనూ ఆరా తీస్తున్నారు.

భర్త మరణవార్త విని భార్య మృతి

బెంగళూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): బాగల్కోటె జిల్లా బీళగి పట్టణంలో నివసిస్తున్న దంపతులు కేవలం గంట వ్యవధిలోనే తుదిశ్వాస వీడారు. ఖిల్లా కాలనీకి చెందిన శశిధర పత్తార (40) సోమవారం రాత్రి పొద్దుపోయాక 1.45 గంటలకు గుండెపోటుతో మృతి చెందాడు. కాసేపటికే భార్య సరోజా పత్తార (35)కు బంధువులు విషయం తెలిపారు. 2.15 గంటలకు ఒక్కసారిగా భర్తలేరనే విషయం తెలుసుకుని కుప్పకూలి గుండెపోటుతో అక్కడికక్కడు మృతి చెందారు. దంపతులకు అభి, ప్రీతమ్ అనే కుమారులు ఉన్నారు.

క్యాన్సర్ పట్ల అప్రమత్తత తప్పనిసరి

» నటుడు శివరాజ్‌కుమార్

బెంగళూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధికి అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయని అయితే ముందస్తు అప్రమత్తత ముఖ్యమని ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. నగరంలోని హెణ్ణూరు రోడ్డులో స్పర్శ్ ఆసుపత్రికి అనుబంధంగా క్యాన్సర్ కేర్ ప్రత్యేక విభాగాన్ని మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి శివరాజ్‌పాటిల్, అంకాలజీ సర్వీసెస్ డైరెక్టర్ శేఖర్ పాటిల్, ప్రముఖ నటి ప్రేమ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డైరెక్టర్ శేకర్ పాటిల్ మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సలకోసం 300 పడకల విభాగాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. న్యూక్లియర్ మెడిసిన్, మెడికల్ సర్జికల్, రేడియేషన్ అంకాలజీ, హెమటాలజీ, హెమటో అంకాలజీ, పాలివేటివ్ సపోర్టివ్ కేర్ విభాగాలు ఏర్పాటు చేశామన్నారు. పెట్ సీటీ, ఎంఆర్ఐ స్కానర్స్‌తోపాటు మాడ్యులర్ అంకాలజీ ఆపరేషన్ థియేటర్స్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. అన్నిరకాల క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే చికిత్సల ద్వారా కోలుకోవచ్చునన్నారు. నటి ప్రేమ తమ అనుభవాన్ని పంచుకున్నారు.



చికిత్సా విభాగాన్ని ప్రారంభిస్తున్న నటుడు శివరాజ్‌కుమార్ తదితరులు

చిన్నారులకు ఉచిత నేత్ర పరీక్షలు



మీడియా సమావేశంలో విద్యార్థులతో వైద్యబృందం

బెంగళూరు, నవంబరు4(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాసన్ ఐకేర్ ఆసుపత్రిలో నెలరోజులపాటు ఉచిత నేత్ర పరీక్షలు జరుపనున్నట్టు ప్రకటించారు. ప్రముఖ నేత్రవైద్య నిపుణులు డాక్టర్ వీణ ప్రభు, మహేశ్ భండారిలు మాట్లాడుతూ వాసన్ ఐకేర్ బొమ్మనహళ్ళి శాఖలో ఉచిత స్క్రీనింగ్ కల్పించామన్నారు. 15ఏళ్లలోపు పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాసన్‌లో అత్యాధునికమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పోస్టర్లు విడుదల చేయించారు.

కార్యకర్తలను ఆదుకుంటాం: టీడీపీ

చిలమత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న ప్రతి కార్యకర్తను ఆదుకునే ప్రయత్నం చేస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందుతున్న చిలమత్తూరుకి చెందిన టీడీపీ కార్యకర్త ముత్యాలప్ప కుటుంబానికి మంగళవారం టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణయాదవ్ తదితరులు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. పార్టీ కోసం కష్టపడే వారికి పార్టీ ఎప్పటికీ మరవదన్నారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథరెడ్డి, శివ, చంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

రహదారి సమస్య పరిష్కారం

గోరంట్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలివాండ్లపల్లి రహదారి సమస్యను అధికారులు మంగళవారం పరిష్కరించారు. తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్ సిబ్బందితో గ్రామానికెళ్లి చర్చించి సమస్య పరిష్కారం అయ్యేలా చేశారు. సర్పంచ్ సువర్ణ అశ్వత్థరెడ్డి ఆధ్వర్యంలో ట్రిప్పర్లతో మట్టిని తరలించి రహదారి పనులు చేపట్టారు.

స్టాంపుల సేకరణతో ఉత్సాహం

బెంగళూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్టాంపుల సేకరణ కొత్త ఆలోచనను రేకెత్తిస్తుందని ప్రముఖ సాహితీవేత్త హంప నాగరాజయ్య అభిప్రాయపడ్డారు. మంగళవారం చిత్రకళాపరిషత్‌లో జిల్లాస్థాయి స్టాంపుల సేకరణ ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించారు. చిత్రకళాపరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బీఎల్ శంకర్, పోస్టుమాస్టర్ జనరల్ చంద్రశేఖర్ కాకుమాను, పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ సందేశ్ మహదేవప్ప, వీ తార తదితరులు పాల్గొన్నారు. పోస్టల్ సేకరణ పట్ల ఆసక్తి కల్గినవారు పెద్ద ఎత్తున ప్రదర్శనలో పాల్గొన్నారు. సెల్ఫీ పాయింట్‌తోపాటు దేశ విదేశాలకు సంబంధించి పలు రకాల స్టాంపులు ప్రత్యేక ఆకర్షణ అనిపించాయి. చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. బుధవారం కూడా ప్రదర్శన కొనసాగనుంది.



స్టాంపులు విడుదల చేస్తున్న హంప నాగరాజయ్య




పోస్టుబాక్స్, పోస్టుమ్యాన్ వేషధారణను వీక్షిస్తున్న చిన్నారులు

యువకుడి మృతదేహం లభ్యం

చింతామణి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చింతామణి గ్రామీణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాచహళ్ళి వద్ద చెట్టుకు ఉరివేసుకుని వేలాడుతున్న స్థితిలో యువకుడి మృతదేహం మంగళవారం గుర్తించారు. మృతుడిని చింతామణి తాలూకా మూడచింతలహళ్ళికి చెందిన నిఖిల్‌కుమార్ (19)గా గుర్తించారు. మంగళవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. నిఖిల్‌కుమార్‌కు మూడచింతలహళ్ళికి చెందిన శారదమ్మ(35)తో సన్నిహితంగా ఉండేవాడని తెలుస్తోంది. సోమవారం రాత్రి 9 గంటలకు నిఖిల్‌కుమార్, శారదమ్మ మధ్య వాగ్వాదం జరిగిందని, దీంతో నిఖిల్‌ను ఆమె ఇతరులతో కలసి చెట్టుకు ఉరివేసి హతమార్చారని అతడి తల్లిదండ్రులు పోలీసులకు పిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. స్థానికంగా ఈ ఘటన కలకలం కలిగించింది. సమగ్ర దర్యాప్తులో మరిన్ని అంశాలు వెలుగుచూసే అవకాశం ఉందని తెలుస్తోంది.



నిఖిల్‌కుమార్ (ఫైల్)



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.04	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	9,078	15,536
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	9,510	15,116
నీటి నిల్వ (టీఎంసీలు)	79.93	101.77

అగ్నివీర్ నియామకాలకు సర్వం సిద్ధం: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

బళ్లారి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అగ్నివీర్ నియామకాలు ఏర్పాట్లు పూర్తి చేశామని, ఈ నెల 13 నుంచి 19వ వరకూ అగ్నివీర్ సేన నియామకానికి ప్రత్యేక ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. అగ్నివీర్ సేన నియామకానికి సంబందించి మంగళవారం డీసీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కల్యాణ కర్ణాటక జిల్లాల్లో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి బళ్లారి ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. అన్ని ప్రాంతాల నుంచి బళ్లారికి అభ్యర్థులు వస్తారని, ర్యాలీలో శారీరక దృఢత్వం, వైద్య పరీక్షలు ఉంటాయన్నారు. అన్ని ప్రక్రియలు పూర్తియ్యే వరకూ జిల్లా అధికారులు ఆర్మీ అధికారులతో సహకరించాలని సూచించారు. జిల్లాలో ఏడు రోజులపాటు జరిగే ర్యాలీలో కర్ణాటక, కేరళ రాష్ట్రాల అభ్యర్థులు కూడా హాజరవుతారన్నారు. ర్యాలీ ప్రక్రియ ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతుందన్నారు. ప్రతి రోజు 800 నుంచి 1000 మంది అభ్యర్థులు ఈ రిక్రూట్‌లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేపట్టామన్నారు. ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన అభ్యర్థులకు నగరంలోని ప్రభుత్వ అతిథి గృహం, పోలీస్ జింఖానా, వాల్మీకి భవన్. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ భవన్ తదితర చోట్ల వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.




విష్ణుసాయి కిరణ్

వేదవతిలో ఇద్దరు బాలుర గల్లంతు

బళ్లారిరూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వేదవతి నదిలో ఇద్దరు బాలురు గల్లంతయ్యారు. బళ్లారిరూరల్ తాలుకా పరమదేవనహళ్లి పరిధిలోని హగరి గ్రామానికి చెందిన విష్ణుసాయి, కిరణ్ మంగళవారం సాయంత్రం స్నానం చేసేందుకు నది వద్దకు వెళ్లారు. కాలుజారి నదిలో పడిపోయిన బాలుడిని కాపేడేందుకు మరొకరు వెళ్లి ఇద్దరూ మునిగిపోయారని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. స్థానికులు, పోలీసులు రాత్రి వరకు నదిలో గాలింపు నిర్వహించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఫలితం లేకుండా పోయింది. పీడీహళ్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

అరటి చెట్ల నరికివేత

నార్పల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండ్లపల్లి గ్రామంలో రవీంద్రరెడ్డి అనే రైతుకు చెందిన 42 అరటి చెట్లను గుర్తు తెలియని దుండగులు నరికివేశారు. గ్రామంలో రవీంద్రరెడ్డి మూడు ఎకరాల పొలంలో అరటి పంటను సాగు చేశాడు. ప్రస్తుతం పంట గెల దశలో ఉంది. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు 42 అరటి చెట్లను నరికివేశారు. ఉదయం రైతు పొలానికి వెళ్లగా చెట్లు నరికిన విషయాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అధ్వాన స్థితిలో అంగన్‌వాడీ కేంద్రాలు

● భవనం శిథిలం కావడంతో కార్యకర్త ఇంట్లోనే నిర్వహణ ● చిన్నారుల ఇబ్బందులు పట్టని అధికారులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్ వాడీ కేంద్రాలు కొన్ని దుస్థితికి చేరుకున్నాయి. చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ, ఆరోగ్య సంరక్షణ, తల్లి, చిన్నపిల్లల ఆరోగ్యం, ప్రారంభ బాల్య విద్య, సామాజిక అవగాహ, మహిళల సాధికారత వంటి అంశాల్లో కీలక పాత్ర వహిస్తున్న కేంద్రాలు అధికారుల చిత్త శుద్ధి లోపంతో ఇబ్బందులు పడుతున్నాయి. జిల్లాలో ఒకే ఇంటిలో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ ప్రజా ప్రతినిధులు ప్రాతినిథ్యం వహిస్తున్న సండూరు తాలూకాలో అంగన్ వాడీ కేంద్రాలు అధ్వాన్నంగా ఉండడం విడ్డూరంగా మారింది. భవనం ఏ క్షణమైనా కూలే స్థితిలో ఉండడంతో అంగన్‌వాడీ కార్యకర్త తన ఇంటి ఆవరణలోనే కేంద్రం నిర్వహిస్తోంది. తాలూకా పరిధిలోని కురేకుప్ప పట్టణంలోని అంగనవాడీ కేంద్రం శిథిలం కావడంతో చేసేది లేక పిల్లల భద్రతా దృష్ట్యా కార్యకర్త నివసించే అద్దె ఇంటి ఆవరణంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తోంది. అంగనవాడీ కేంద్రం నడిపేందుకు పట్టణంలో అవసరమైన కట్టడం కొరత, అద్దె ఎక్కువ కావడంతో కేంద్రాన్ని తన చిన్న ఇంట్లోనే నడుపుతోంది. పిల్లల కూడా ఎండ, గాలి, వర్షంలో తడుస్తునే కాలం వెళ్లదీస్తున్నారు. ఇల్లు చిన్నది కావడంతో పౌష్టికాహారం, బియ్యంతో పాటు ఆహార సామాగ్రి భద్రపరచడానికి స్థలం లేదు... గ్యాస్ సిలిండర్ కూడా అదే ప్రాంతంలో ఉండడంతో ఇరుకైన స్థలంలోనే పిల్లలు కాలం వెళ్లదీస్తున్నారు. కేంద్రంలో 18 మంది పిల్లలు ఉన్నారు. కేంద్రంలో ఉన్నారు. అంగన్‌వాడి కేంద్రంలో సహాయకి మార్చి నెలలో సేవా నివృతి కావడంతో కేంద్రంలో ఒక్కరే పిల్లల పోషణ చేస్తున్నారు. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉన్నా... నిత్యం పర్యవేక్షణలో ఉన్న మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కేంద్రాన్ని మార్చకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే అంగన్ వాడీ కేంద్రాన్ని మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.



కార్యకర్త ఇంటి ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్ వాడీ కేంద్రం




వినతిపత్రం అందజేస్తున్న కరుణాడ క్రియాశీల్ సభ్యులు

ఇందిరా క్యాంటీన్ ఏర్పాటు చేయాలని వినతి

బళ్లారి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హొస్పేట్ లోని పునీత్ రాజ్ కుమార్ జిల్లా స్టేడియం వద్ద ఇందిరా క్యాంటీన్ ప్రారంభించాలని కరుణాడ కలియ క్రియాశీల్ సమితి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహ్మద్‌ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ వివిధ ప్రాంతాల నుంచి పేద విద్యార్థులు, అలాగే కార్మికులు ఉన్నారని ఇక్కడ ఇందిరా క్యాంటీన్ ఏర్పాటు చేయడం వల్ల ఎంతో మందికి ఆకలి తీర్చున వారు అవుతారని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

మధ్యాహ్న భోజనంలో పెసరపప్పు

● పాఠశాలలో ప్రారంభించిన అధికారులు



మధ్నాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బళ్లారి గాంధీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి):జిల్లాలో గనుల బాధిత ప్రాంతాలైన బళ్ళారి, సండూరు తాలూకాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల పౌష్టిక ఆహారంగా పెసలు, పండ్లు పంపిణీ చేసే మధ్యాహ్న భోజన పథకం, క్షీరభాగ్య యోజన, ఎస్ఎన్ఎఫ్ పథకంతో పాటు పాఠశాల అవధి ముగిసిన తరువాత విద్యార్థులకు పెసరపప్పు, పండ్లను పంపిణీ చేసే కార్యక్రమం సోమవారం నుండి విద్యాశాఖ అధికారులు బళ్లారి నగరంలోని కర్నాటక పబ్లిక్ బాలికల పాఠశాలలో ప్రారంభించారు. రాష్ట్రంలో గనుల బాధిత జిల్లాలో గనుల పరిసర పునస్థాపన మండలి(కెఎంఇఆర్‌సి)ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలలిపారు. సండూరు, బళ్ళారి తాలూకా పరిధిలో సుమారు 400 పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం సరఫరా అవుతుందో అక్కడ ఇస్కాన్ నుండే పెసరు పప్పు, పండ్లు పంపిణీ జరుగుతోంది. మిగిలిన ప్రాంతాల్లో పాఠశాల అభివృద్ధి స మితి ఆధ్వర్యంలో ఈ పథకాన్ని అమలు పరుస్తుందని జిల్లా స్థాయి విద్యాశాఖ అధికారులు తెలిపారు.

కళాకారులతో స్టెప్పులు వేసిన ఎమ్మెల్యే



పౌరాణిక నాటకంలో స్టెప్పులు వేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సింధిగేరి గ్రామంలో సోమవారం రాత్రి శశికళా పరిణయం పౌరాణిక నాటకంలో కళాకారులతో పాటు ఎమ్మెల్యే గణేష్ స్టెప్పులు వేసి అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ గ్రామాల్లో పౌరాణిక నాటకాల వల్ల గ్రామాల్లో ప్రశాంతం మేలుకొని సుఖ జీవనం కొనసాగిస్తారని తెలిపారు. ఇలాంటి పౌరాణిక నాటకాల వల్ల పిల్లలకు పురాతన కాలం నాటి అర్థాలు తెలియజేయబడతాయని తెలిపారు. యువకులు పౌరాణిక నాటకాలకు ప్రాధాన్యం కల్పించాలి. మొబైల్‌లో టీవీల మోజులో పడి అనారోగ్యాలకి గురికాకూడదని సూచించారు. ఈ పౌరాణిక నాటకంలో ఎమ్మెల్యే గణేష్ స్టెప్పులు వేయడంతో గ్రామంలోని ప్రజలు చప్పట్లు కొడుతూ హర్షం వ్యక్తపరిచారు.

ప్రార్థన సమయంలో విద్యార్థుల తొక్కిసలాట

● బాలికకు కాలు విరగడంతో తల్లిదండ్రుల ఆందోళన

రాయచూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో జరిగిన తొక్కిసలాటలో బాలిక కాలు విరగడంతో తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. రాయచూరు తాలూకామర్చెడ్ గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రార్థన సమయంలో గలాట చోటు చేసుకుంది. ఉదయం యథావిధిగా పాఠశాల ప్రారంభమైన వెంటనే ప్రార్థన చేసేందుకు బయటకు వచ్చారు. విద్యార్థులు క్రమ శిక్షణతో మెలగకపోగా తొక్కిసలాటకు దిగడంతో 4వ తరగతి చదివే బాలిక కిందపడి కాలు విరిగిపోయింది. దీంతో ఒక్క సారిగా పాఠశాల వద్ద కలకలం రేగింది. అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు ఉపాధ్యాయుల తీరు పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులెవరూ అక్కడ లేకపోవడంతోనే తొక్కిసలాట జరిగిందిని, ఇందుకు ఎవరు బాధ్యులు అంటూ ఉపాధ్యాయులను స్థానికులు నిలదీశారు. కొంతమంది గ్రామస్థులు ఉపాధ్యాయుల పట్ల తీవ్రంగా మందలిస్తూ ఇలా నిర్లక్ష్యంగా విధులు నిర్వహించే వారు తమ గ్రామంలోకే రావద్దంటూ మండిపడ్డారు. కాగా కాలు విరిగిన బాలికను వెంటనే తల్లిదండ్రులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు.

రెండో పంటకు నీరివ్వాల్సిందే

● హసిరుసేన రైతు సంఘం డిమాండ్

బళ్లారి గాంధీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆయకట్టు ప్రాంతంలో రెండో పంటకు సాగునీరు అందించాలనే రైతుల డిమాండ్ ఎక్కువ అవుతోంది. మంగళవారం రాష్ట్ర రైతు సంఘం హసిరు సేన సంఘం నగరంలోని అతిథిగృహం ప్రాంగణంలో రైతులతో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా బళ్లారి జిల్లా పరిధిలోని వివిధ తాలూకాల నుంచి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని పోరాటాల గురించి చర్చలు జరిపారు. సభలో రైతు అభిప్రాయాలను సంగ్రహించారు. ఐసీసీలో తీసుకునే నిర్ణయం తర్వాత కార్యాచరణ చేపట్టాలని రైతులు నిర్ణయించారు. రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు కరూరు మాధవ రెడ్డి, లేపాక్షి, ఐనాథ రెడ్డి, సూరిబాబు, బసవ రాజు స్వామి, సురేంద్ర, ఈరణ్ణ మూలలిమని, గణేష్ స్వామి పంపనగౌడ, తిమ్మారెడ్డి, ఉపమాపతి గౌడ, మేటి నాగరాజు గౌడ, చెన్నారెడ్డి, రామనగౌడ, పంపాపతి, శ్రీశైల అలదళ్ళి, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

పెరిగిన చిన్న ఉల్లి ధరలు

హోసూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని హోసూరు, పరిసర ప్రాంతాలలో రైతులు చిన్న ఉల్లిపాయలను విస్తృతంగా సాగు చేస్తున్నారు, అదేవిధంగా రాష్ట్ర సరిహద్దులోని అత్తిబెలె, ఆనేకల్ ప్రాంతాలలో చిన్న ఉల్లిపాయలను సాగు అవుతోంది. ఇక్కడ పండించిన చిన్న ఉల్లిని రైతులు స్థానిక, విదేశీ మార్కెట్లకు అమ్మకానికి ఎగుమతి చేస్తున్నారు. హోసూరులో దిగుబడి ప్రభావితమైనప్పుడు కర్ణాటకలో పండించిన చిన్న ఉల్లిపాయలను అమ్మకానికి తీసుకువస్తారు. కొన్ని నెలలుగా హోసూరులో చిన్న ఉల్లిపాయలను రూ.40 నుంచి 50 వరకు ఉండేది. ఇటీవల వరుస వర్షాలతో స్థానికంతోపాటు పొరుగున కర్ణాటకలోని ఉల్లిపంట దిగుబడి తగ్గింది. ఈ కారణంగా హోసూరు మార్కెట్‌కు సరఫరా తగ్గడంతో ధరలు క్రమ క్రమంగ పెరిగాయ. కిలో ఉల్లి ధర రూ.60 నుంచి రూ.75 వరకు ఉంటోంది. గత సంవత్సరం చిన్న ఉల్లి కిలో గరిష్ఠంగా రూ.150 దాకా ఉండేదని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

పెరుగుతున్న బైక్ చోరీలు



బైక్ అపహరణకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీ

హోసూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో చిన్న, సూక్ష్మ, పెద్ద పెద్ద కర్మాగారాలు ఉన్నాయి. కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు రోజూ హోసూరు, బాగలూరు మరియు పరిసర ప్రాంతాలలో ఉంటూ రాకపోకలు సాగిస్తుంటారు. చాలా మంది కార్మికులు ప్రతిరోజూ ద్విచక్రవాహనాలపై పనికి వెళ్తుంటారు. ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికులు ఖరీదైన ద్విచక్ర వాహనాలను ఇళ్ల ముందు పార్కింగ్ చేయడం సామాన్యం. అయితే గుర్తు తెలియని వ్యక్తులు వాహనాలను చోరీ చేస్తున్న సంఘటనలు అధికమవుతున్నాయి. చోరీ చేసిన వాహనాలను సరిహద్దులోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోతున్నాయని అంచనాగా ఉంది.. దీని వల్ల దొంగిలించిన వాహనాలను ట్రాక్ చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో చోరీల నియంత్రణకు రాత్రిపూట గస్తీ నిర్వహించడంతోపాటు నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర సరిహద్దులో నిరంతరం నిఘా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి పంచాయతీ యూనియన్ కాటినాయనపల్లిలోని అంజనేయ సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి చెందిన నిరుపయోగమైన భూములలో మొక్కలు నాటే పనిని కలెక్టర్ ఎస్.దినేశ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాలయాలకు చెందిన ఉపయోగించిన భూములలో తాటి, ఇతర చెట్లతో సహ మొక్కలను నాటడానికి, నిర్వహణకు సీఎస్ఆర్ సంస్థల ద్వారా ఖర్చు చేయనున్నట్లు ప్రకటించారు. కృష్ణగిరి జిల్లాకు 50 వేల మొక్కలను నాటేలా ప్రణాళిక చేయబడింది. దీని ప్రకారం మంగళవారం కట్టినాయనపల్లి అంజనేయ సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయానికి చెందిన నిరుపయోగంగా ఉన్న భూములలో 10 చింత మొక్కలు, 5 పనస మొక్కలు, 35 వేప, 40 పూల మొక్కలు, మొత్తం 150 మొక్కలను నాటినట్లు కలెక్టర్ ఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. తర్వాత బర్గూరు తాలుకా బాలేపల్లి ప్రభుత్వ పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, పిల్లల హాజరు రిజిస్టర్, బరువు, ఎత్తు, ఆహార పదార్థాల లభ్యత, పిల్లలకు వండిన ఆహారం, కోడిగుడ్లను పరిశీలించి విద్యార్థుల అభ్యాసాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాలలో బాలకలకు మరుగుదొడ్డి, ప్రహరీ గోడ, పాఠశాలకు అదనపు తరగతి భవనం నిర్మించాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. తదనంతరం జిల్లా యంత్రాంగం మల్లప్పడి పంచాయతీలోని కుండల కుట్టై, ఇరుళార్, గ్రామాలను సందర్శించారు. కార్యక్రమంలో కవిప్రియ, రామమూర్తి, అన్నాదురై, కృష్ణగిరి జిల్లా కార్యనిర్వాహక అధికారులు చిత్ర, శివ, చిన్నస్వామి తదితరులు ఉన్నారు.



కాటినాయనపల్లి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

డీఎంకే బూత్ ఏజెంట్లకు శిక్షణ



సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ సత్య

హోసూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): హోసూరు నగర డీఎంకే పార్టీ కార్యాలయంలో 45వ వార్డులకు చెందిన పార్టీ ఏజెంట్లకు శిక్షణ శిబిరం జరిగింది. శిబిరంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ గురించి మేయర్ సత్య వివరంగా ప్రసంగించారు. . మంగళవారం నుంచి డిసెంబర్ 4 వరకు ఒక నెల పాటు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణను కూడా పర్యవేక్షించాలన్నారు. పీఎల్ఏ అన్ని ఓటర్ల ఇళ్లను సందర్శించాలన్నారు. పిఎల్ఏ 2 ప్రత్యేక ఓటరు సవరణ జాబితాను నిశితంగా పర్యవేక్షించాలన్నారు. వార్డు కౌన్సిలర్లు, వార్డు కార్యదర్శులు, పిఎల్ఏలు స్వయంగా పర్యవేక్షించి పనిచేయాలన్నారు. ఇదే సందర్భంగా పార్టీ అభివృద్ధి పనులపై కూడా చర్చించారు. కార్యకర్తలకు పలు విధులు అప్పగించారు. సమావేశంలో మున్సిపల్ కౌన్సిల్ చైర్మెన్ సెందిల్ కుమార్, డిప్యూటి సెక్రటరీలు గోపాలకృష్ణన్, శాంతి మున్సిపల్ కోశాధికారి త్యాగరాజు, ఏరియా సెక్రటరీలు డిప్యూటీ మేయర్ ఆనందయ్య, కౌన్సిలర్లు వెంకటేశ్, రాము, రాజా, జిల్లా ప్రతినిధులు జై ఆనంద్, చెన్నీరప్ప, శ్రీనివాసన్, నాగరాజ్, ఐటీ టీమ్ ఆర్గనైజర్ కలైవానన్ మున్సిపాలిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రైలులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

బళ్లారి గాంధీనగర్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బళ్లారి మీదుగా వెళ్తున్న యశవంతపుర వీక్లీ ఎక్స్‌ప్రెస్(18111) ఎక్స్‌ప్రెస్ రైలులో తరలిస్తున్న ఐదు కిలోల గంజాయిని రైల్వే రక్షణా దళం(ఆర్‌పిఎఫ్) అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నవంబరు 1వ తేదీన జరిగిన రైల్వే పోలీసుల దాడుల్లో స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.50వేలు ఉన్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. జార్ఖాండ్‌లోని టాటా నగర్ జంక్షన్ నుంచి బెంగళూరు యశ్వతపురం మధ్య వారంలో ఒకసారి ప్రయాణించే ఈ రైలులో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. సీటుక్రింద గంజాయి కలిగిన బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎవరు తరలిస్తున్నారనేది తేలాల్సి ఉంది. కార్యాచరణలో ఆర్‌పీఎఫ్ కమాండ్ సిద్దలింగప్ప, రైల్వే పోలీసు అధికారి జి.నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు.

ఒక్కటైన 28 జంటలు

కంప్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని రామసాగరం గ్రామంలో గౌరీపౌర్ణమి పండుగ సందర్భంగా హైస్కూలు ఆవరణంలో దళిత సంఘర్షణ సమితి అధ్యక్షుడు రామయ్య ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. ఇందులో 28 జంటలు ఒక్కటయ్యాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణేష్ జిల్లా దళిత సమాజ నాయకుడు మానయ్య ఇతరులు కార్యక్రమంలో పాల్గొని వివాహాలను జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా రామయ్య సామూహిక వివాహాల వల్ల పేద కుటుంబాలు వారికి ఎంతో అనుగుణం అవుతుందన్నారు. ఒక్కటైన దంపతులు అన్యోన్యంగా వుంటూ జీవితాన్ని కొనసాగించాలన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని ఎదురించి జీవితం ముందుకు కొనసాగించాలన్నారు. అనంతరం మానయ్య మాట్లాడుతూ తాలుకాలో ప్రతి ఒక్కరు రామయ్య ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. ప్రతి గౌరీ పండుగ సందర్భంగా రామసాగర గ్రామంలో ఈ వివాహాలతో పండుగ వైభవంగా జరుపుకుంటామన్నారు. గౌరీపండుగ అంటేనే రామసాగరం, రామసాగరం అంటేనే గౌరీ పండుగ అనేలా అన్ని సమాజాల వారు ఐక్యతతో ముందుకు వచ్చి వివాహాలు జరపడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు ఆశ, శివశంకర్‌గౌడ, నారాయణప్ప, దానప్ప, గోవిందు, హోసకోట జగదీష్, వీరాంజనేయులు, గిరి, కురుగోడు పురసభ అధ్యక్షులు శేకన్న, హనుమంతు, లక్ష్మన్న, దళిత సంఘర్షణ సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



దంపతులను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణేష్, కాంగ్రెస్ నాయకులు మానయ్య, రామయ్య